
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024



మెదక్‌లో రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మెదక్ అర్బన్, ఆగస్టు 4: తెలంగాణ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం మంగళవారం 10 గంటలకు ఇందిరాగాంధీ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. అండర్-23 బాల, బాలికలకు పరుగు, జంప్స్, త్రో విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 10, 11 తేదీల్లో ఇందిరాగాంధీ స్టేడియంలోనే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 9963005540 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రైతులా.. రాజ్



రైతులతో కలిసి నాటేసిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నిత్యం అధికార కార్యక్రమాలతో బిజీబిజీగా ఉండే మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్... కాసేపు హోదాను పక్కన పెట్టి రైతులతో కలిసి పొలం పనుల్లో పాల్గొన్నారు. మెదక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ఔరంగబాద్ రైతు గొల్ల నారాయణ పొలంలో కలెక్టర్ దంపతులు ఇద్దరి పిల్లలు కూలీలతో కలసి నాట్లు వేశారు. రైతుల పొలాలను పరిశీలించారు. సాగు పద్ధతులను, ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలో వచ్చే లాభం తదితర అంశాలపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతే దేశానికి వెన్నెముక అని కొనియాడారు. మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 70 వేల మంది రైతులకు రూ.447 కోట్ల రైతు రుణమాఫీ నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. లాభాదాయక సాగు చేసే దిశగా సర్కార్ పనిచేస్తుందన్నారు.

-మెదక్ అర్బన్



జీవో 58, 59
కథ కంచికేనా..


- క్రమబద్ధీకరణ దరఖాస్తులపై ఏళ్ల తరబడి నిరీక్షణ
- జిన్నారం మండలంలోనే అత్యధికం
- రూ. లక్షలు చెల్లించినా క్రమబద్ధీకరణ చేయకవడంతో లబ్ధిదారుల్లో భయాందోళనలు



జిన్నారం, ఆగస్టు 4: ప్రభుత్వ భూముల్లో నివాసాలు నిర్మించినవారికి క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం తెచ్చిన జీవో 58, జీవో 59 కింద చేసుకున్న దరఖాస్తులపై ఏటూ తేలడం లేదు. ప్రభుత్వ నిర్ణయం వెలవడక రుసుం చెల్లించినవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2016 నుంచి మూడుసార్లు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరిం ఆరు. దరఖాస్తులు చేసినవారిలో చాలామందికి ఇప్పటికీ క్రమబద్ధీకరణ చేయలేదు. సంగారెడ్డి జిల్లాలో 6వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒక్క జిన్నారం మండలంలోనే మరో వేయికి పైగా దరఖాస్తులు పరిష్కారం కావల్సిఉంది.

జిన్నారం మండలంలో 500 దరఖాస్తులు

జీవో 58, 59 కింద జిల్లాలోనే అత్యధికంగా జిన్నారం మండలం నుంచి 2,887 దరఖాస్తులు వచ్చాయి. క్రమబద్ధీకరణ ప్రక్రియపై మొదటి నుంచి గందరగోళం నెలకొన్నది. మొదటి విడతలో మండలంలో 2200 మంది దరఖాస్తు చేసుకోగా అందులో చాలామందికి క్రమబద్ధీకరణ జరుగలేదు. మొదటి విడతకు సంబంధించిన దరఖాస్తుల్లోనే 1,100 ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా దరఖాస్తుల పరిస్థితిపై సమాచారం కూడా లేదు. రెండో విడత, మూడో విడతలో చేసిన 2,887 దరఖాస్తుల్లో కొందరికి రూ. లక్షలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపడంతో వ్యతరేకత వచ్చింది. అడ్డగోలుగా క్రమబద్ధీకరణ రుసుం విధించారని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. మరికొందరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న మొత్తం చెల్లించారు. ఈమేరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణాలను పరిశీలించి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఇందులో రెగ్యులరైజేషన్‌కు అర్హత ఉన్న బొల్లారం, మాదారం గ్రామాలకు చెందిన 150 మందికి జీవో 59 కింద, 11 మందికి జీవో 58 కింద రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. పలు దరఖాస్తులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇటీవల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బొల్లారం మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.



అమీన్‌పూర్ మండలం బండ్లగూడకు చెందిన ఓవ్యక్తి తమ వ్యవసాయ భూమిని వారసత్వ ఫౌతి మార్పిడి కోసం ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్లు లంచం డిమాండ్ చేయగా రూ.30వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఓ రైతుకు భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి ధరణి ఆపరేటర్ రూ.20 వేల లంచం అడిగాడు. ఆ రైతు తన వద్ద డబ్బు లేవని మొరపెట్టుకున్నా వినలేదు. చివరకు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి ఆపరేటర్‌ను పట్టించాడు.

ఈ రెండు ఘటనలు ఉమ్మడి మెదక్ జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ధరణి ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లపై ఫిర్యాదులకు అద్దం పడుతున్నాయి. కొంతమంది సక్రమంగా రిజిస్ట్రేషన్లకు సహకరిస్తుండగా.. ఇంకొందరు చేయి తడిపితే గాని చేతికి పనిచెప్పడం లేదనే విమర్శలున్నాయి. సాహసించి ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళితేనే ఇలాంటివి బట్టబయలవుతున్నాయి. లేదంటే దర్జాగా వసూళ్లు కొనసాగిస్తున్నారు.

ఆపరేటర్లకు ధరణి

తహసీల్దార్ కార్యాలయాల్లో వసూల్‌రాజాలు

- కంప్యూటర్, ధరణి ఆపరేటర్లపై ఆరోపణలు
- భూక్రయవిక్రయాల్లో చేతివాటం ప్రదర్శన
- మామూళ్లలో పెద్దసార్లకు మధ్యవర్తిత్వం
- తాజాగా అమీన్‌పూర్‌లో ఏసీబీకి పట్టివేత
- మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ పలువురిపై ఫిర్యాదులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 4 : సాధారణంగా తహసీల్దార్ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతుంటాయి. లంచాలు తీసుకుంటూ అడ్డంగా దొరికిన తహసీల్దార్లు సైతం ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు కూడా ఈ జాబితాలో లేకపోలేరు. వీరి బాటలోనే ధరణి, కంప్యూటర్ ఆపరేటర్లూ నడుస్తున్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నందున ముందుగానే ధర మాట్లాడుకుంటున్నారు. క్రయవిక్రయదారులు తమ లావాదేవీల గురించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోగానే ఆ సమాచారం ధరణి పోర్టల్‌కు చేరుతున్నది. మ్యుటేషన్, ఫౌతి, రిజిస్ట్రేషన్, పీవోబీ, సీలింగ్ తదితర కార్యకలాపాలకు ధరలు నిర్ణయిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక మరక అంటిస్తున్నారనే అభియోగాలు సైతం ఉన్నాయి. దీని ఆధారంగా వసూళ్లకు లైన్‌క్లియర్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొన్నది.

అక్కడక్కడా వారిదే పెత్తనం

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎంపికైన డాటా ఎంట్రీ ఆపరేటర్లు పలు తహసీల్దార్ కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్నారు. ఏళ్ల తరబడిగా అక్కడే వేళ్లూనుకొని ఉండడంతో కార్యాలయానికి వచ్చే అధికారులు కూడా వీరి మాటనే వినాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వివాదాస్పదమైన భూములు, సర్వే నంబర్లను కూడా సక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించే తెలివితేటలు వీరికి ఉండడంతో అధికారులూ ఆపరేటర్ల మాటకు కట్టుబడుతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్ మండలాలు, సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్, గజ్వేల్, మర్కూక్, సిద్దిపేట అర్బన్, జగదేవ్‌పూర్ మండలాలు, మెదక్ జిల్లా తూప్రాన్, నర్సాపూర్, మాసాయిపేట, మనోహరాబాద్, మెదక్, రామాయంపేట మండలాల్లో భూములకు విలువ ఉంది. ఇక్కడ భూలావాదేవీలకు తహసీల్దార్ కార్యాలయాలపై ఆధారపడాల్సిందే. ఎకరాకు కోట్లలో ధరలు ఉండడంతో రిజిస్ట్రేషన్ల సమయంలో వెనుకంజ వేయకుండా అడిగినంతా ఇచ్చుకుంటున్నారనే పరిస్థితి వినిపిస్తోంది. ఈ మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లోనూ ధరణి ఆపరేటర్ల పెత్తనం అంతాఇంతా కాదు. భూముల్లో ఉన్న లోటుపాట్లను గుర్తించి తమ బంధువులు, స్నేహితుల పేరిట కూడా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారనే ఆరోపణలూ వ్యక్తమవుతున్నాయి.

స్థానచలనం అవసరమే

రెవెన్యూ శాఖలో అధికారులు, ఉద్యోగులతోపాటు ధరణి, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా రెండేళ్లకోసారి స్థానచలనం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలక అధికారులతోపాటు ఆపరేటర్లపైనా నిఘా ఉంచాలని కోరుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన కంప్యూటర్ ఆపరేటర్లను ఇటీవల బదిలీ చేశారు. అందరికీ స్థానచలనం కలిగించి కలెక్టర్ మనూచౌదరి ఒక మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. రెండేళ్ల కిందట మెదక్ జిల్లాలోనూ ఇదే విధంగా కొంతమందిని మార్పులుచేర్పులు చేశారు. ఇప్పుడు సంగారెడ్డి జిల్లాతోపాటు మెదక్‌జిల్లాలోనూ ఆరోపణలున్న ఆపరేటర్లను బదిలీ చేసేలా చర్యలు చేపట్టాలనే డిమాండ్ నెలకొంది.



రెడ్డిపల్లిలోని పీహెచ్‌సీ భవనం

రోగమొచ్చిందని దవాఖానకు వస్తే..
షాక్ కొడుతున్నది..!

చినుకు రాలితే పీహెచ్‌సీ భవనం గోడలకు కరెంట్ షాక్

భయాందోళనలతో వైద్యసిబ్బంది, రోగులు

మెదక్ జిల్లా రెడ్డిపల్లి పీహెచ్‌సీలో పొంచిఉన్న ప్రమాదం

నర్సాపూర్, ఆగస్టు 4: రోగమొచ్చిందని దవాఖానాకు వస్తే కరెంట్ షాక్ కొడుతున్నది. ఎక్కడ గోడలను ముట్టుకున్నా జల్లు మంటున్నది. దీంతో, ఆస్పత్రికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఈ పరిస్థితి మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్నది. ఈ పీహెచ్‌సీకి రెడ్డిపల్లి, కాజీపేట, మంతూరు, చిప్పల్‌తుర్తి, ఇబ్రహీంబాద్, చెన్నాపూర్‌తో పాటు పలు గిరిజన తండాల నుంచి వైద్యం కోసం ప్రజలు వస్తుంటారు. ఔట్‌పేషెంట్లతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల నుంచి గర్భిణులు, బాలింతలు చెకప్ కోసం వస్తుంటారు. ఈ పీహెచ్‌సీ భవనం పైకప్పు దెబ్బతినడంతో వర్షపు నీళ్లు కారుతున్నాయి. వానాకాలంలో గోడలన్నీ నీటి చెమ్మ వచ్చి తడిగా మారుతున్నాయి. ఏ గోడను పట్టుకున్నా కరెంట్‌షాక్ వస్తున్నది. దీంతో, దవాఖానాకు వచ్చే రోగులతో పాటు వైద్యులు, నర్సులు, ఉద్యోగులు సైతం వర్షం వచ్చే సమయంలో ఈ భవనంలో ఉండాలంటే భయపడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనపడుతున్నారు. ఈ విషయంపై గత నెలలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా ప్రస్తావించారు, అయినా, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఈసారైనా అనుమతి వచ్చేనా?

మెదక్ మెడికల్ కాలేజీ ప్రారంభానికి మరోసారి అప్పీలు
ఈ సంవత్సరం వైద్య తరగతుల ప్రారంభంపై అనుమానాలు?
వైద్యవిధానమండలి నిబంధనల మేరకు వసతుల అప్‌గ్రేడ్
80 శాతం ఫ్యాకల్టీ, విభాగాధిపతుల నియామకం పూర్తి



ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు సిద్ధం చేసిన పాత కలెక్టరేట్ భవనం

మెదక్ అర్బన్, ఆగస్టు 4: దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న చందంగా ఉన్నది మెదక్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు తీరు. మెదక్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎంపిక చేసిన భవనం నిబంధనలకు అనుగుణంగా లేదని, వసతులు, ఫ్యాకల్టీ నియామకాలు సరిగ్గా లేవనే కారణాలతో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. దీంతో వైద్యశాఖ అధికారులు లెటర్ ఆఫ్ పర్మిషన్ కోసం రెండోసారి దరఖాస్తు చేశారు.

మంజూరై ఏడాది..

జిల్లాకు గత సర్కారు 100 సీట్లలతో మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ 2023 జూలై 5న గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కళాశాల భవన నిర్మాణం కోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ.. పరిపాలనా అనమతులు జారీ చేసింది. వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం పిల్లికొట్టాల్ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రి పక్కన 14 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం 50 సీట్లతో మెడికల్ కాలేజీని 2024-25 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది.

సౌకర్యాలు అంతంతే..

మెడికల్ కళాశాల భవనం పూర్తయ్యే వరకు జిల్లా కేంద్రంలోని పిల్లికొట్టాల్ వద్ద గతంలో కలెక్టరేట్ నిర్వహించిన అద్దె భవనంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ణయించి ఏర్పాట్లు చేశారు. కానీ, ఈ భవనంలో వైద్య కళాశాల నిర్వహణకు సరిపడా వసతులు లేవని, ఫ్యాకల్టీ నియామకాలు కూడా సరిగ్గా లేవంటూ జాతీయ వైద్యవిధానమండలి (ఎన్ఎంసీ) కళాశాల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌వోపీ) ఇవ్వడానికి తిరస్కరించింది. ఈమేరకు గతవారం ప్రకటన చేసింది.

హెచ్చరించినా మారని తీరు

వైద్య కళాశాల ఏర్పాటుకు నూతన భవన నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో, పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ భవన యాజమాన్యాన్ని ఒప్పించారు. భవనానికి మరమ్మతులు చేపట్టి, రంగులు వేశారు. భవవాన్ని కలెక్టర్ పలుమార్లు పరిశీలించి వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వసతుల నిర్వహణ, ఫ్యాకల్టీ నియామకాలపై జూన్ 24న జాతీయ వైద్యవిధాన మండలి సభ్యులు తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం వసతులు, ఫ్యాకల్టీ నియామకాలు చేపట్టాలని సూచించారు. అయినా సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారన్న విమర్శలున్నాయి. దీంతో, వసతులు లేవని, భవన లీజు విషయంలో నిబంధనలు పాటించలేదనే కారణాలతో ఎల్‌లోపీ ఇవ్వడానికి తిరస్కరించింది.

నీలినీడలు?

ఎన్ఎంసీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఈ సంవత్సరం మెడికల్ కళాశాల ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ షెడ్యూల్ వెలువడనుండడంతో వైద్య కళాశాల ఏర్పాటు అనుమతులను సాధించడం జిల్లా ప్రజాప్రతినిధులకు ప్రతిష్టాత్మకంగా మారింది. తనిఖీల్లో ఎన్ఎంసీ బృందం చూపిన సవరించి రెండోసారి అప్పీల్‌కు వెళ్లేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది.

లెటర్ ఆఫ్ పర్మిషన్ కోసం అప్పీల్ చేశాం..



మెడికల్ కళాశాల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ ఎంపిక చేసిన అద్దె భవనంలో సరైన వసతులు లేవని ఎన్ఎంసీ అనుమతి నిరాకరించింది. దీంతో, ఎంఎన్‌సీ కోరిన విధంగా నిబంధన ప్రకారం కళాశాలకు ఫ్యాకల్టీ నియామకాలను చేపట్టి, వసతులు కల్పిస్తున్నాం. లెటర్ ఆఫ్ పర్మిషన్ కోసం మరోసారి అప్పీల్ చేశాం.

-రవీందర్, మెదక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రజావాణి'

రేగోడు: రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 10:30 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణిని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు. భూ సమస్యలపై రైతులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దళితులను విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పికొడదాం



ఖేడ్‌లో సమావేశమైన నాయకులు

నారాయణఖేడ్, ఆగస్టు 4: ఎస్సీల వర్గీకరణ పేరిట దళితులను విచ్ఛిన్నం చేసే మనువాద కుట్రలను తిప్పికొడదామని ఖేడ్ నియోజకవర్గంలోని మాలల ఐక్యవేదిక నాయకులు భీంసేన, కొటారి నర్సింహులు, దేవరాజు, శ్రీనివాస్, పండరి, రాము, గౌతం, సురేష్, సంతోష్, నర్సింహులు, విజయ్ తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో రాజ్యాంగాన్ని తొలగించే కేంద్రం ప్రభుత్వ కుట్రలో భాగమే వర్గీకరణ అని వారు పేర్కొన్నారు. మాలల ఐక్యత చాటేందుకు 6న ఖేడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు.

అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో దినసరి కూలి ఆత్మహత్య

శివ్వంపేట, ఆగస్టు 4: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాలతో దినసరి కూలి పురుగుల మందు సేవించి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ్వంపేట మండలం చెన్నాపూర్‌కు చెందిన గుమ్ముల ఆంజనేయులు(40) ఈ నెల 3న మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అప్పులు ఉండగా ఎందుకు మద్యం సేవించి వస్తున్నావని భార్య ఎల్లమ్మ భర్త ఆంజనేయులును అడిగింది. కోపంతో ఎల్లమ్మను కొట్టడంతో తిమ్మాపూర్‌లో ఉండే ఆడపడుచు ఇంటికి వెళ్లింది. దీంతో ఆంజనేయులు పురుగుల మందు సేవించాడు. గమనించిన ఆంజనేయులు తమ్ముడు రాజు ఎల్లమ్మకు ఫోన్‌చేసి చెప్పగా.. నర్సాపూర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

● ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సాపూర్, ఆగస్టు 4: ఆగి ఉన్న లారీని వెనకనుంచి బైక్‌తో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న లారీ నర్సాపూర్ పట్టణంలో సిగ్నల్ పడడంతో ఆగింది. లారీ వెనకాలే వేగంగా వచ్చిన బైక్ ఢీకొని లారీ కిందికి దూసుకెళ్లిపోయింది. ఈ ఘటనలో లింగాపూర్ గ్రామానికి చెందిన ప్రభు, చిన్న అనే యువకులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు.

భరతమాతను విశ్వగురువు స్థానంలో నిలబెట్టాలి

● ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ జయదేవ్

జహీరాబాద్, ఆగస్టు 4: భరతమాతను విశ్వగురువు స్థానంలో నిలబెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ జయదేవ్ అన్నారు. శనివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ నగర్ పార్కులో తపస్ యూనియన్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థుల్లో దేశభక్తి, దైవభక్తిని, నైతిక విలువలను పెంపొందించే విధంగా కృషి చేయాలన్నారు. వేదాలను వర్గీకరించి మహాభారత అష్టాదశ పురాణాలను రచించి ఎంతో సేవ చేసిన వ్యాసమహర్షి జన్మదినాన్ని గురుపూర్ణిమగా జరుపుకుంటూ.. సద్గురువులను గౌరవించడం మన సాంప్రదాయమని తెలిపారు. అనంతరం జహీరాబాద్, ఝరాసంగం మండల విద్యాధికారులు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సుకోసం నిరంతరం కృషిచేయాలన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన, బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, తుక్కప్ప, అడివప్ప, గోపాల్, నర్సింహారెడ్డి, బస్వరాజ్, దశరత్, తుకారాం పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ఒకరు మృతి

దుబ్బాక, ఆగస్టు 4: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన పురుషోత్తం(32) సిద్దిపేట నుంచి (టీఎస్ 15 ఈకే 1120) నెంబరు గల బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే మెదక్ డిపోకు చెందిన బస్సు ఢీకొనడంతో పురుషోత్తం అక్కడికక్కడే మృతిచెందాడు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

● అత్తింటివారే హత్య చేశారంటూ మృతుడి బంధువుల ఆందోళన


మృతుడి అత్తింటి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు


కిరణ్(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 4: కుటుంబ గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మల్లుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 12 ఏళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన చిటుకుల ఉదయ్‌కిరణ్ (35)కు మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన చిటుకుల ప్రవళికతో వివాహమైంది. ఇల్లరికం అల్లుడిగా రావడంతో అత్తగారింట్లోనే సంసార చేస్తున్నాడు. అతడు గవ్వలపల్లిలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని నెలల నుంచి వారి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ గవ్వలపల్లి గ్రామ శివారులోని డంపింగ్ యార్డు షెడ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతుడి బంధువులు అత్తింటి వారే హత్య చేశారంటూ ఆరోపిస్తూ గవ్వలపల్లిలో ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని మెదక్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట, ఆగస్టు 4: మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన బాలికలు ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి ఫోన్‌ను ట్రేస్ చేశారు. హుటాహుటిన వారు ఉన్న స్థలాన్ని కనుక్కొని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఊపిరిపీల్చుకున్నారు. మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.


గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయం

● నేటి నుంచి నెలరోజులు ఉత్సవశోభ
● ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయశాఖ

శ్రావణమాసోత్సవాలకు వీరభద్రస్వామి ఆలయం ముస్తాబు

గుమ్మడిదల, ఆగస్టు 4: ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటిగా నిలిచిన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయం శ్రావణమాసోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయాధికారులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. నేటి నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలు నెలరోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఆలయం చుట్టూ పూలతో అలంకరణ చేశారు. హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఆలయం ఉండడంతో భక్తులు వందల సంఖ్యలో వచ్చి పూజలు చేస్తుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఇబ్బందులు కలుగకుండా ఈవో శశిధర్‌గుప్తా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

కొత్త కట్టడాలతో ఆకర్షణీయంగా ఆలయం

గతం కంటే ప్రస్తుతం వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధి ఎంతో పురోగతి చెందింది. దాతల సహకారంతో అప్పటి చైర్మన్ గటాటి భద్రప్ప కృషితో రూ.4 కోట్లపైనే నిధులు ఖర్చుచేసి ఆలయం చుట్టూ మూడు రాజగోపురాలు, గర్భగుడి చుట్టూ పాకార మండపం, ప్రత్యేకంగా యజ్ఞశాల, ఆలయ ఖాళీ ప్రాంగణం మొత్తం కొత్తరకం బండలు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధిని చూసి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5 నుంచి పూజలు

ఈనెల 5న నుంచి వీరభద్రస్వామి ఆలయంలో ప్రారంభంకానున్న శ్రావణమాస లక్ష బిల్వార్చన పూజలు నెలరోజులపాటు కొనసాగనున్నాయి. ఉదయం 7 గంటలకు బిందు తీర్థం, అభిషేకంతో శ్రావణమాసోత్సవాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం గణపతి పూజ, రుత్విక్‌కరణ పూజలతో పాటు తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని పూజించుకున్న అనంతరం సత్యనారాయణ వ్రతం, అభిషేకాలు నిర్వహించుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక మండపంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు 5 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు సమకూర్చాం. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలి.

- శశిధర్‌గుప్తా, ఆలయ ఈవో


మహా మంత్ర హవనంలో పాల్గొన్న భక్తులు

భగళాముఖి ఆలయంలో మహా మంత్ర హవనం

శివ్వంపేట, ఆగస్టు 4: శక్తిపీఠం భగళాముఖి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరశర్మ, పూజారి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహా మంత్ర హవనం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్తా ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థల దాత పబ్బా స్వరూపరమేష్‌గుప్తా, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం.. కేతకీ ఆలయం


క్యూలో బారులుతీరిన భక్తులు

ఝరాసంగం, ఆగస్టు 4: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢమాసం ముగింపు అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం క్యూలో బారులుతీరారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారుల అన్ని ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు చేశారు. అలాగే మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో గల రామేశ్వర ఆలయంలో ఆదివారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాడలేని వాన

● ఎండుతున్న పొలాలు
● కాపాడుకునేందుకు అన్నదాతల ప్రయత్నాలు


జంగరాయిలో నెర్రలు బారుతున్న వరి పంట

చిన్నశంకరంపేట, ఆగస్టు 4: ఖరీఫ్ మొదలై రెండునెలలు గడిచిపోతున్నా వరుణుడి జాడ కానరాలేదు. ఈయేడు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన మాటలు రైతులను నిరాశకు గురిచేసింది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో అడపాదడపా కురిసిన వానలకు సాగుచేసిన పొలాలు నీరు లేక నెర్రలు బారుతున్నాయి. రోహిణి కార్తీ మొదలుకుని నేటికీ సరైన వర్షాలు కురువలేదు. వర్షాలు కురవక పోవడంతో చెరువులు, కుంటల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. జూన్‌లో 176.4 మి.మీ, జూలైలో 141.6 మి.మీ మాత్రమే వర్షం కురిసింది. కాగా ఆగస్టు ప్రారంభమైనా ఇప్పటికీ వర్షం పడలేదు. చిన్నశంకరంపేట మండలంలో అర సెంటీమీటర్ వర్షం కూడా కురువలేదంటే కరువు ఛాయలు ఏ మేరకు ఉన్నాయో అర్థమవుతున్నది. ఈ యేడు 6 ఎకరాలలో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువరైతు మృతి


సురేష్(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 4: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువరైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లికి చెందిన మోతకాని సురేష్(32) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆరునెలల క్రితం 20 గుంటల భూమి అమ్మగా వచ్చిన డబ్బులతో కొంత అప్పు తీర్చాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలాని తరచూ సురేష్ తన భార్య రేఖకు చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గతనెల 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి కింద పడుకున్నాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆదివారం మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


కనకయ్య(ఫైల్)

చేర్యాల, ఆగస్టు 4: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన బండారి కనకయ్య(49) గత 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటూ హస్మత్‌పేటలో పాత ఇనుప సామాను వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా బీపీ, షుగర్, అల్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామమైన గురువన్నపేటకు చేరుకుని సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


తల్లిదండ్రులతో చిన్నారి

చేర్యాల, ఆగస్టు 4: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో తప్పిపోయిన మూడేళ్ల పాపను స్థానికుడు పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలానికి జన్ను రాజు కుటుంబసమేతంగా మల్లన్న దర్శనార్థం వచ్చారు. ఈ క్రమంలో అతడి మూడేళ్ల కూతురు నిత్యశ్రీ తప్పిపోయి వీధులగుండా ఏడుస్తూ కనిపించడాన్ని గుర్తించిన స్థానికుడు కడమంచి మల్లేశం పాపను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విషయం తెలిపాడు. దీంతో పోలీసులు ఆలయ మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయడంతో ఠాణాకు చేరుకున్న తల్లిదండ్రులకు పాపను అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ రాజుగౌడ్ కడమంచి మల్లేశంను అభినందించారు.

విద్యుత్ వ్యవస్థకు మెరుగుకు డిస్కం చర్యలు..!

● రూ.25 కోట్లతో 10 సర్కిళ్లలో మరమ్మతు పనులు
● డీటీఆర్‌ల చుట్టూ రక్షణ చర్యలు, విద్యుత్‌స్తంభాలకు సిల్వర్ కలర్
● గ్రేటర్‌లో 11,770 పాయింట్లలో సర్వే నిర్వహించి సమస్యల గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్ఠంగా మార్చేదిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు ప్రారంభించింది. మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో 33/11 కేవీ ఫీడర్లు, ఎల్‌టీ విద్యుత్ లైన్ల అభివృద్ధి, మరమ్మతులకు డిస్కం రూ.25 కోట్ల నిధులు కేటాయించింది. గ్రేటర్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, సైబర్ సిటీ, హబ్సిగూడ, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్‌సౌత్, మేడ్చల్, రాజేంద్రనగర్, సంగారెడ్డి, సరూర్‌నగర్, సికింద్రాబాద్ సర్కిళ్లలో 11,770 పాయింట్లలో సర్వే నిర్వహించిన అధికారులు, సిబ్బంది మూడు జోన్ల పరిధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు, రక్షణ లేని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, కిందికి వాలిన కండక్టర్లు, రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్‌ఎంయూ)ల వద్ద పలు లోపాలు గుర్తించారు. గుర్తించిన లోపాలు తొలగించి విద్యుత్‌సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు సోమవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎం ముషారఫ్ ఫరూకీ ఉన్నతాధికారును ఆదివారం ఆదేశించారు. జూన్ నెలలో గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా 11 కేవీ ఫీడర్లతో పాటు స్తంభాలు, డిస్టిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు(డీటీఆర్), విద్యుత్‌లైన్లపై సర్వే నిర్వహించిన పాయింట్ల ఫోటోలను టీజీఎయిమ్స్ యాప్‌లో ఇప్పటికే నమోదు చేశారు. వాటి ఆధారంగా పనులు పూర్తిచేసే దిశగా విద్యుత్‌శాఖ చర్యలు చేపడుతుంది. రక్షణ లేని డీటీఆర్‌ల చుట్టూ ఫిన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ స్తంభాలకు సిల్వర్ కలర్ వేయడం, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ మరమ్మతుల పనులు పూర్తిచేసి బిల్లులు పెట్టే క్రమంలో చేసిన పనులు, వాటికి సంబంధించిన ఫోటోలు టీజీఎయిమ్స్ యాప్‌లో అప్‌డేట్ చేయాలని వాటి ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేదిశగా డిస్కం ప్రణాళికలు రూపొందించింది.

సర్వే చేపట్టిన పాయింట్లు...

● మెట్రో జోన్ - 1,846
● రంగారెడ్డి జోన్ - 3,124
● మేడ్చల్ జోన్ - 6,800
● గ్రేటర్ జోన్ మొత్తం - 11, 770

రేషన్‌కార్డు లేక.. రుణమాఫీ కాక

● బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
● రెండు విడతల్లో ఇదే పరిస్థితి
● కంది రైతువేదిక వద్ద రైతుల ఆందోళన


కంది రైతువేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు(ఫైల్)

కంది, ఆగస్టు 4: ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతనెల 18న రూ.ఒక లక్షలోపు ఉన్న రైతులకు, 31న రూ.1.5 లక్షలలోపు రుణాలు ఉన్న రైతులకు రుమాఫీ చేసింది. అయితే ఇప్పుడు రైతు రుణమాఫీకి బ్యాంకుల్లో రేషన్‌కార్డు లింకు అడ్డంకి అయ్యింది. రైతులు రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో రుణమాఫీ కావాలంటే రేషన్‌కార్డు లింక్ చేయాల్సిందేనని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్న రైతులు, అసలు రేషన్‌కార్డు లేని మరికొందరు రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాక ఎందరో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. దీంతో కంది రైతువేదిక వద్ద ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు కొన్నిరోజులుగా ఆందోళన చేపడుతున్నారు. రేషన్‌కార్డు లేకున్నా తమకు రుణమాఫీ చేయించాలని వారు డిమాండ్ చేశారు. రుణమాఫీకి కంది మండలంలో మొదటి విడతలో 1,537 మంది రూ.ఒక లక్ష రుణమాఫీకి అర్హులు కాగా, రెండో విడతల రూ.1.5 లక్షల రుణమాఫీకి 597 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా సంగారెడ్డి, కంది పరిధిలో ఉన్న ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, డీసీఎంఎస్, గ్రామీణ బ్యాంకులతో పాటు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు.

వేధిస్తున్న రేషన్‌కార్డు సమస్య

ఎక్కువమంది రైతులను రేషన్‌కార్డు సమస్య వేధిస్తున్నది. పదేళ్ల క్రితం కొత్తగా ఇచ్చిన రేషన్‌కార్డులు ఉన్నవారికి రుణమాఫీ కావడం రైతన్నలను ఆవేదనకు గురిచేస్తున్నది. పదేళ్ల క్రితం పెళ్లిళై వేరు కాపురాలు పెట్టిన యువ రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే ఆ రుణం మాఫీకి ఇప్పుడు రేషన్‌కార్డు ఆటంకంగా మారింది. రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ అవుతుందని బ్యాంకు అధికారులు స్పష్టం చేయడంతో రేషన్‌కార్డు లేని రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. రైతులకు ఉన్న భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ జరగడం కోసం ప్రత్యేక వ్యవస్థ ద్వారా సర్వే చేపడుతున్నామని వ్యవసాయ అధికారులు తెలిపారు. త్వరలోనే రుణమాఫీకి అడ్డంకిగా ఉన్న రేషన్‌కార్డు లింకు లేకున్నా బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యేలా ఉన్నతస్థాయి కమిటీ పని చేస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

మా కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నది



కంది మండలంలోని జుల్‌కల్ గ్రామంలో మాది ఉమ్మడి కుటుంబం. మా కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నది. పదేళ్ల క్రితం రేషన్‌కార్డులు ఇచ్చారు. ఇప్పుడు మా ఇద్దరు కుమారులు పెళ్లిళ్ల చేసుకొని వేరు కాపురాలు పెట్టారు. 2021లో మా కుటుంబంలో నేను, నా భార్య, ఇద్దరు కుమారులు కలిసి తలా లక్ష చొప్పున రూ.4 లక్షలు పంట రుణం తీసుకున్నాం. రేషన్‌కార్డు మాత్రం అందరికీ కలిపి ఒక్కటే ఉండడంతో రెండు విడతల్లో మాకు ఎవ్వరికి ఒక్కపైసా కూడా రుణమాఫీ కాలేదు. అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

- యూసఫ్, రైతు, జుల్‌కల్

రేషన్‌కార్డు లేదు.. రుణమాఫీ కాదా?



కంది మండలంలోని వడ్డెనగూడతండా పంచాయతీ పరిధిలో ఉన్న కొయ్యగుండు తండా మాది. మాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మా తండా ఏర్పడినప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. 2023లో బ్యాంకులో రూ.96 వేలు రుణం తీసుకున్నాను. బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ పదిసార్లు తిరిగాను. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ రెండు విడతల్లో ఒకటే కారణం రేషన్‌కార్డు లేకపోవడమే. కొత్త రేషన్‌కార్డు ఎప్పుడు వస్తుందో, రుణమాఫీ ఎప్పుడు అవుతుందో అని ఆశగా ఎదురు చూస్తున్నాం. అధికారులు వెంటనే స్పందించి మాకు రుణమాఫీ అయ్యేలా చూడగలరు.

- మోత్యానాయక్, రైతు, కొయ్య గుండుతండా

దేవుని చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు



అక్రమ తవ్వకాలతో ప్రమాదకరంగా మారిన గుంతలు

శివ్వంపేట, ఆగస్టు 4: మండలంలోని సికింద్లాపూర్ దేవుని చెరువులో నల్లమట్టిని కట్ట వెడల్పు పేరిట గత నాలుగు రోజులుగా అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు కొందరు శనివారం దేవుని చెరువులో రెండు హిటాచీలతో అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తూ సేద్యానికి అవసరమయ్యే సారవంతమైన నల్ల మట్టిని సుమారు 10 టిప్పర్లతో రాత్రింబవళ్లు గ్రామానికి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న కమర్షియల్ పనులకు తరలిస్తూ లెవలింగ్ పనులు చేపట్టారు. కట్ట వెడల్పు పేరిట యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలు నిర్వహించడంతో చెరువులో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. టిప్పర్లలో మట్టి తరలిస్తుండగా ప్రధాన రోడ్డుపై మట్టి పడి అతుక్కుపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపును అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అర్బన్‌పార్కు కల సాకారమయ్యేనా?

● నారాయణఖేడ్ శివారు ప్రాంతంలో అర్ధాంతరంగా ఆగిన పనులు ● గత ప్రభుత్వ హయాంలో రూ.1.80 కోట్లు మంజూరు ● రూ. కోటి విలువైన పనులు పూర్తి

నారాయణఖేడ్, ఆగస్టు 4: ప్రజల ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అర్బన్ పార్కు నిర్మాణం పనులను అటవీశాఖ పరిధిలో చేపట్టినప్పటికీ, నిధుల కొరత వెంటాడుతున్నది. దీంతో పార్కు పనులు అసంపూర్తిదశలో నిలిచిపోయి అర్బన్‌పార్కుల కల కల్లలవుతున్నాయని నారాయణఖేడ్ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

నారాయణఖేడ్ శివార్లలోని వెంకటాపూర్ పరిధిలో అటవీశాఖ భూముల్లో అర్బన్‌పార్కు ఏర్పాటు కోసం గత ప్రభుత్వం రూ.1.80కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అటవీ ప్రాంతంలో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం, అంతే మోతాదులో ఫెన్సింగ్, ఎంట్రీ ప్లాజా, వాచ్ టవర్, గజబ్ గది నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఫెన్సింగ్ పనులు పూర్తి చేయడమే కాకుండా సైక్లింగ్ ట్రాక్ కోసం లోపలి భాగంలో రోడ్డు నిర్మాణం పనులు సైతం పూర్తి చేశారు. ఎంట్రీ ప్లాజాకు సంబంధించి రెండు వైపులా గోడను నిర్మించినప్పటికీ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. అటవీశాఖ పరిధిలోని భూముల్లోకి వెళ్లడానికి అవసరమైన రోడ్డు కూడా వేయించారు. వాచ్‌టవర్, గజబ్ గది నిర్మాణం పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకు చేపట్టిన



నారాయణఖేడ్ సమీపంలోని వెంకటాపూర్ వద్ద అసంపూర్తి దశలో ఎంట్రీ ప్లాజా పనులు

పనులకు రూ.కోటి వరకు ఖర్చు చేసినప్పటికీ, కాంట్రాక్టర్లకు పూర్తయిన పనుల బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తి దశలోనే వదలివేశారు. మిగతా పనుల గురించి కూడా ఎవరూ పట్టించుకోవడంలేదు.

మూడేళ్లుగా ఆగిన పనులు

నారాయణఖేడ్ పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో అర్బన్ పార్కు నిర్మాణం పనులు, ఖేడ్-నిజాంపేట జాతీయ రహదారిపక్కన చేపడుతుండడంతో ఆటవిడుపుగా ఆహ్లాదంతో పాటు వాకింగ్, యోగా లాంటి ఆరోగ్య కార్యక్రమాలకు సైతం ఉపయోగపడుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశించారు. అయితే మూడేళ్లుగా నిధుల కొరతతో అసంపూర్తి దశలోనే పనులు ఆగియాయని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అసంపూర్తి దశలో ఆగిపోయిన అర్బన్ పార్కు నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టి సారించాలి

నారాయణఖేడ్‌ప్రాంతంలో చెప్పుకోదగ్గ స్థాయిలో పార్కులు సైక్లింగ్ ట్రాకులు లేకపోవడంతో అర్బన్‌పార్కులో చెట్ల మధ్య ట్రాక్ ఏర్పాటు చేస్తారని ఎంతగానో సంతోషించామని పలువురు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఆటవిడుపు కోసం కుటుంబ సమేతంగా సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా సమీపంలోని అర్బన్ పార్కులోనే వాచ్ టవర్ ద్వారా పైకి ఎక్కి ప్రకృతి అందాలను తిలకించే అనుభూతి పొందవచ్చని ఆశించామని స్థానికులు చెబుతున్నారు. గజబ్‌గది ద్వారా అందరూ ఒకేసారి ఒకే దగ్గర కూర్చొని యోగాతో పాటు పరస్పర యోగక్షేమాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని భావించినప్పటికీ, పనులు ఆగిపోవడం తమను నిరాశకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అసంపూర్తి దశలో నిలిచిపోయిన అర్బన్‌పార్కు పనులను వెంటనే పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేద్దాం

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4: విద్యారంగ అభివృద్ధికి కృషి చేసి బడుగు బలహీన వర్గాల విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దుదామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ తెలిపారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో పాఠశాల విద్యాశాఖలో ఇటీవల వివిధ సబ్జెక్టుల్లో పదోన్నతి పొందిన 40మంది ఎస్టీయూ కుటుంబసభ్యులకు ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ మాట్లాడుతూ.. పదోన్నతులు ఇప్పించడంలో ఎస్టీయూ కీలకపాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయ హక్కుల కోసం ఏర్పడ్డ ఎస్టీయూ సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులపై ప్రత్యేకమైన గౌరవంతో ముందుకు వెళ్లడం అంటే మనందరిపై మరింత బాధ్యతలు పెట్టారని, దానిని నెరవేర్చే క్రమంలో అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కార్యదర్శి హఫీజ్, జీవన్‌రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, పదోన్నతి పొందిన జీహెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ఆత్మీయతను పంచిన స్నేహితుల దినోత్సవం



సంగారెడ్డిలో లయన్స్ క్లబ్ సభ్యుల వేడుకలు



మెదక్ స్టేడియంలో సన్‌రైజ్ వాకర్స్ సందడి



వెల్దుర్తిలో చిన్నారుల ఉత్సాహం



మనోహరాబాద్: కూచారం గ్రంథాలయంలో..

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ సంబరాలను సంగారెడ్డి చౌరస్తాలోని జేఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులతో స్నేహితులంతా సందడి చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ పిల్లిగుండ్ల రాములుగౌడ్ మాట్లాడుతూ ప్రపంచంలో స్నేహానికి మించినది ఏదీ లేదని చెబుతూ స్నేహితుల ప్రాముఖ్యాన్ని వివరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ అధ్యక్షుడు లయన్ జార్జ్ మ్యాథ్యూస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ శంకరి విజయేందర్‌రెడ్డి, జోన్ చైర్మన్ మంగళపర్తి వెంకటేశం, హనుమంత్‌గౌడ్, కార్యదర్శి నాయికోటి రామప్ప, కోశాధికారి శేషత్వం క్రిష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

● గుమ్మడిదల: మండలంలో ఫ్రెండ్ షిప్ డే వేడుకలను పలువురు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ప్రపంచ ఫ్రెండ్ షిప్ డే దినోత్సవ సందర్భంగా పలు గ్రామాల్లో చిన్ననాటి స్నేహితులు, స్కూల్, కాలేజ్ క్లాస్‌మేట్లు, యువత పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ స్నేహానికి గుర్తుగా చేతికి బ్యాండేజ్ కట్టి స్వీట్లు తినిపించుకున్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కార్యాలయంలో పలువురు స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి ఆత్మీయతను వ్యక్తం చేశారు.

● మెదక్ అర్బన్: స్నేహితుల దినోత్సవాన్ని మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని సన్‌రైజ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు స్నేహితుల దినోత్సవ కేక్ కట్ చేశారు. వనితా క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

● వెల్దుర్తి: వెల్దుర్తిలో ఆదివారం విద్యార్థులు ఘనంగా స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను చేతికి కట్టి ఉల్లాసంగా గడిపారు.

● మనోహరాబాద్: మండలంలోని కూచారం గ్రామంలో గ్రంథాలయంలో చిన్నారులతో స్నేహితుల దినోత్సవ సంబురాలు జరుపుకున్నారు. స్నేహం అంటే తుదిశ్వాస వరకు విడిపోకుండా ఉండాలని గ్రంథాలయ ప్రెసిడెంట్ స్వామి ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నారులు, గ్రంథాలయ సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి 'సీఎంఆర్‌ఎఫ్' వరం



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 4: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 179 మంది లబ్ధిదారులకు రూ.63.28లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యలతో వైద్యం అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనేదే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఎవరూ కార్పొరేట్ వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. సంక్షేమ పథకాలను సైతం అత్యంత పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఇందిరమ్మఇళ్ల పథకం ద్వారా ఎంతో మంది ఇండ్లు లేని పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్‌బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో వర్గీకరణ ఫలాలు అందుకోవాలి



మాసాయిపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

మాసాయిపేట, ఆగస్టు 4:: షెడ్యూలు కులాల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్రాలు అమలుచేసే క్రమంతో పాటు వర్గీకరణ ఫలాలు అందుకోవడంలో అప్రమత్తతతో మసులుకోవాలని ఎమ్మార్పీఎస్ సీనియర్‌నాయకుడు అల్లారం రత్నయ్య పేర్కొన్నారు. ఆదివారం మాసాయిపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణ విజయోత్సవ సభ, ర్యాలీని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, 30 ఏళ్లకు వర్గీకరణ ఫలాలు అందుకొనే అవకాశం వచ్చిందని సీనియర్‌నాయకుడు మాసాయిపేట యాదగిరి పేర్కొన్నారు. సభకు ముందు మండలకేంద్రంలో భారీఎత్తున ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. ర్యాలీలో ఉమ్మడి మెదక్ జిల్లా నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, నాగభూషణం, యాదగిరి, చేబర్తి యాదగిరి, కొమ్ముశేకులు, నరాల లక్ష్మణ్, కొల్చుల రామస్వామి, గుడ్డి శోభ, ముక్క వినోద్, బుడగ జంగం నాయకులు నర్సింహులు, శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రహదారిని కప్పేస్తున్న పిచ్చి మొక్కలు



మార్లగడ్డ తండా సమీపంలో రోడ్డును కప్పేసిన పిచ్చి మొక్కలు

శివ్వంపేట, ఆగస్టు 4: సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారిలో శివ్వంపేట మండలం మార్లగడ్డ తండా సమీపంలో పిచ్చి మొక్కలు గడ్డి రోడ్డును కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

రైతు వేదికకు వెళ్లే దారేది..?



గడిపెద్దాపూర్ రైతు వేదిక ఎదుట చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

అల్లాదుర్గం, ఆగస్టు 4: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతువేదికలు రైతుల ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని గడిపెద్దాపూర్‌లో నిర్మించిన రైతు వేదిక పరిస్థితి ఇదే దుస్థితిలో ఉంది. రైతువేదిక ముందు కుంగిపోతుండటంతో వర్షం నీరంతా ఈ వేదిక ముందు భాగంలో చేరుతుందని గ్రామస్థులు తెలిపారు. అయితే ఈ రైతువేదిక నిర్మాణ సమయంలో ముందుభాగంలో పెద్ద గొయ్యి ఉండేదని, దాని ప్రభావంతోనే వర్షం నీరు నిల్వ ఉంటుందని, దీంతో రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. రైతు వేదిక ముందు వర్షంనీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో రేగోడు రైతువేదిక

రేగోడు, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి పంటలపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రతి క్లస్టర్‌కు ఒక రైతువేదికను ఏర్పాటు చేసింది. అన్ని వసతులతో ఏర్పాటు చేసిన రైతువేదికలు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో అసంపూర్తి పనులతో కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలో ఆర్ ఇటిక్యాల, రేగోడు, టి లింగంపల్లి, గజవాడ క్లస్టర్లలో రైతువేదికలను నిర్మించారు. రేగోడు రైతువేదిక వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి కనెక్షన్ ఇచ్చినా విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో రైతువేదికలోని ఫ్యాన్లు, లైట్లు అలంకార ప్రాయంగా మారాయి. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతువేదికకు మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసినా నీళ్లు మాత్రం రావడం లేదు. అధికారులు స్పందించి రైతువేదిక నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నర్సాపూర్, ఆగస్టు 4: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టడంలో సోషల్ మీడియా కో ఆర్డినేటర్ల కీలకపాత్ర పోషించాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు



గుమ్మడిదల: బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో రుద్ర హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



జహీరాబాద్‌లోని సిద్ధేశ్వరాలయంలో దైవదర్శనార్థం బారులు తీరిన భక్తులు

గుమ్మడిదల, ఆగస్టు 4 : మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అమావాస్య పురస్కరించుకొని ఆదివారం భద్రకాళి సహిత వీరభద్ర స్వామికి రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ సోమయ్య నేతృత్వంలో రుద్ర హోమాన్ని స్వామివారికి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, ఆలేటి వెంకటరెడ్డి. గణేష్ దంపతులు పాల్గొన్నారు.

● జహీరాబాద్: ఆషాఢం అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం జహీరాబాద్‌లోని ఆలయాలు భక్తులతో సందడిగ మారాయి పట్టణంలోని కైలాసగిరి శివాలయం, సిద్ధేశ్వరాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ ఉత్సవకమిటీల సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఆయా ఆలయాల వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు.

● రేగోడు: మండల కేంద్రంలోని శ్రీ గోకర్ణేశ్వర, వీర హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. రేగోడు గ్రామానికి చెందిన చీదిరే కృష్ణ సహకారంతో అన్నప్రసాద వితరణ చేసినట్టు పూజారి మహేష్ స్వామి తెలిపారు.

ఖేడ్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖేడ్‌లో బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 4: సీఎం సహాయనిధి ద్వారా నాగల్‌గిద్ద మండలం గీమా తండాకు చెందిన ప్రేమ్‌సింగ్‌కు రూ.30 వేలు, ఖేడ్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన శరణుగొండకు రూ.9 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను ఆదివారం ఖేడ్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మనూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

నారాయణఖేడ్, ఆగస్టు 4: ఈనెల 12న ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం జిల్లా నాయకులు సీహెచ్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చదువు, పోరాడు, సాధించు అనే నినాదంతో సంఘం విద్యార్థులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం గత 88 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పోరాడుతుందన్నారు. విద్యార్థులు, మేధావులు, అధికసంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్‌కు సన్మానం



హైదరాబాద్‌లో టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వంశీయాదవ్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4: టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్‌గా సంజయ్‌కుమార్‌ను నియమిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ సంజయ్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు వంశీయాదవ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంశీయాదవ్ మాట్లాడుతూ సంజయ్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. సంజయ్‌కుమార్‌ను టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ, మంత్రి పొన్నంప్రభాకర్‌లకు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు.. సంజయ్‌కుమార్‌ను కలిసిన వారిలో రాజు యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ పారిశుధ్య కార్మికుడు మృతి



మైసయ్య(ఫైల్)

శివ్వంపేట, ఆగస్టు 4: అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన మైసయ్య(34) గత గత ఆరేళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యంతో బాధ్యపడుతున్న మైసయ్యను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అంత్యక్రియలకు పంచాయతీ నుంచి కార్యదర్శి సంతోష్ కుమార్, మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా, చైర్మన్ వెంకట్రామిరెడ్డి, నవీన్‌గుప్తా, షఫీయోద్దీన్‌తో పాటు గ్రామస్థులు ఆర్థిక సహాయం అందించారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

శివ్వంపేట, ఆగస్టు 4: మండల కేంద్రమైన శివ్వంపేటలో ఆదివారం కట్టమైసమ్మకు గ్రామస్థులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి సమర్పించుకున్నారు. అనంతరం రైతు కుటుంబాలు చెట్ల కింద వంట వార్పు చేసుకుని వన భోజనాలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, గంగపుత్రుల వల ప్రదర్శనతో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. కార్యక్రమంలో అంజయ్య కృష్ణ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివ్వంపేట: గ్రామ దేవతకు బోనాలతో భక్తుల ఊరేగింపు

అన్నారంలో ...

గుమ్మడిదల, ఆగస్టు 4: మండలంలోని అన్నారం గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను చక్కగా అలంకరించి పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ పండగ సందర్భంగా పోతరాజు విన్యాసాలు పిల్లలను పెద్దలను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

వైద్యశాల ఆవరణలో 'స్వచ్ఛదనం- పచ్చదనం'



ఖేడ్ వైద్యశాల ఆవరణలో స్వచ్ఛపనులు

నారాయణఖేడ్, ఆగస్టు 4: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న ఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దీంతో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మొక్కలు నాటనున్నట్టు డాక్టర్ రమేష్ తెలిపారు.

ఖేడ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, ఆగస్టు 4: ఖేడ్‌ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ యువజన విభాగం జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు పొట్ట చేతబట్టుకొని వలస వెళ్తున్నారన్నారు. అధ్వానంగా మారిన రహదారులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భాగంగా సంఘం ఖేడ్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా మహిపాల్, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్, ప్రవీణ్, కమిటీ సభ్యులుగా స్వరాజ్, కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకుడు అనిల్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సంగారెడ్డిలో సమావేశమైన అల్లాదుర్గం జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు



వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్‌హాలులో సమావేశమైన జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 4: మెదక్ జిల్లా అల్లాదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్సెస్సీ 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని అట్టహాసంగా నిర్వహించుకున్నారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్నందున పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ క్షేమసమాచారాలను పంచుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో రోజంతా సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

● వెల్దుర్తి, ఆగస్టు 4: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్ ఆత్మీయ సమావేశం జరుపుకుని సందడి చేశారు. 37 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు చిన్నతనంలోని మధురస్మృతులను నెమరువేసుకున్నారు.ఆత్మీయంగా పలకరించుకుని పరస్పర క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులందరిని ఒక చోట చేర్చడంలో రామాగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రమేష్, మధు, అంజర్ తదితరులు చేసిన విశేష కృషికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నేటి నుంచి శ్రావణ సందడి

● నర్సాపూర్, ఆగస్టు 4:: నర్సాపూర్ మండలం రుస్తుంపేట ఆత్మానంద ఆశ్రమంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఐదురోజుల పాటు అర్కపుష్పార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమ పీఠాధిపతి వెంకటస్వామి నేతృత్వంలో తొలిరోజైన సోమవారం గణపతిపూజ, గురుపూజ, గోపూజ, భవానిస్ఫటికరామ లింగేశ్వరస్వామికి శతరుద్రాభిషేకం ఉంటాయన్నారు.

● కోహీర్: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానము యందు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2వ తేదీవరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

● నారాయణఖేడ్: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని పురాతన కాశీనాథ్ ఆలయంలో మహారుద్ర యాగం, రుద్రాభిషేకం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు మలమంచి గురురాజశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ భోగి హన్మండ్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసంలో ప్రతీ సోమవారం ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.